సాక్షి
జగిత్యాల
ఆదివారం । 16 । ఏప్రిల్ । 2023



ముస్లింలకు ఇఫ్తార్

కోరుట్ల: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ ఏర్పాటు చేశారు.



సినిమా షూటింగ్ సందడి

జగిత్యాలటౌన్: అమరులు రామన్న– గోపన్న జీవితగాథ ఆధారంగా నిర్మిస్తున్న సినిమా షూటింగ్ ధరూర్‌క్యాంపులో జరిగింది.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
39.0/26.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగటిపూట ఉక్కపోతగా ఉంటుంది. ఎండతీవ్రత పెరుగుతుంది.

ఇహాలోక జీవితం కొన్ని రోజులే
– కీర్తిప్రతిష్టలే శాశ్వతమైనవి.
– మహ్మద్ ప్రవక్త

	ఇఫ్తార్		సహర్
ఆది	6.36	సోమ	4.32

రంజాన్ వేళలు

స్టార్ సిటీ

సండే స్పెషల్

- సినీ విజయోత్సవాలకు వేదికగా మన స్మార్ట్ సిటీ
- ఈ ఏడాదిలో ఇప్పటికే నాలుగు సక్సెస్ మీట్‌లు

కరీంనగర్ అంటేనే ఉద్యమాలకు వేదిక. కళలకు పుట్టినిల్లు. ఎందరో మహానుభావులు కరీంనగర్ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో చాటి చెప్పారు. ఉద్యమాలే కాదు.. సినీరంగంలోనూ నగరానికి మొదటినుంచి ప్రత్యేకస్థానం ఉంది. హైదరాబాద్, వరంగల్ తరువాత కరీంనగర్‌లోనే సినిమాలకు సంబంధించిన ప్రీరిలీజ్ ఫంక్షన్లు, ఆడియో రిలీజ్ వేడుకలు, విజయోత్సవాలు ఎక్కువగా నిర్వహిస్తున్నారు. సినీ ప్రస్థానంలో 60 ఏళ్ల నుంచి విజయోత్సవాలకు కరీంనగర్ వేదికైంది. నాటి 'సువర్ణసుందరి' నుంచి నేటి 'దసరా' వరకు ప్రతీ విజయాన్ని సినీ హీరోలు నగర ప్రజలతో పంచుకుంటున్నారు. ఓ వైపు స్మార్ట్‌సిటీగా అభివృద్ధి చెందుతున్న నగరంలో.. అప్పుడప్పుడు స్టార్స్ కూడా వచ్చి తళుక్కున మెరుస్తున్నారు. కరీంనగర్‌లో వెండితెర వెలుగులపై సండే స్పెషల్..!! – విద్యానగర్(కరీంనగర్)

- 8లో▸



న్యూస్‌రీల్

ప్రభుత్వ నిర్ణయంతో లబ్ధి



జెండా ఊపి బస్సు ప్రారంభిస్తున్న అధికారులు

జగిత్యాలరూరల్: సెర్ప్ ఉద్యోగులకు ప్రభుత్వం పేస్కేలు ప్రకటించడం అభినందనీయమని డీఆర్డీఏ పీడీ లక్ష్మీనారాయణ అన్నారు. హైదరాబాద్ గచ్చిబౌలిలో జరిగే సెర్ప్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనానికి శనివారం ఉద్యోగులు తరలివెళ్లారు. వీరు వెళ్తున్న బస్సును లక్ష్మీనారాయణ జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, అనేకఏళ్లుగా సెర్ప్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను ప్రభుత్వం గుర్తించి పేస్కేలు అమలు చేయడం అభినందనీయమన్నారు. దీనిద్వారా ఎంతోమందికి ఆర్థిక ప్రయోజనాలు కలుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాస్, చిన్నరాజయ్య, రత్నాకర్, గంగాధర్, రమాదేవి, మరియ, రవీందర్, శ్రీనివాస్, చక్రవర్తి, రమేశ్ పాల్గొన్నారు.

రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి



చెక్కులు అందిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

ధర్మపురి: సాగు పనుల కోసం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అందిస్తున్న రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి జిల్లా డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి కోరారు. స్థానిక ప్రాథమిక సహకారం సంఘంలో శనివారం పలువురు రైతులకు రూ.5.20లక్షల రుణాలకు సంబంధించిన చెక్కులను ఆయన అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. తక్కువ వడ్డీతో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని ఆయన కోరారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, డైరెక్టర్లు ఎల్లాగౌడ్, పెరుక పోశం, పెద్ద పోశం, కౌన్సిలర్ ఉమాలక్ష్మి, సీఈవో రాజేశ్, రైతులు తిరుపతమ్మ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశాలు

జగిత్యాల: బేగంపేట, రామంతాపూర్‌లోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఒకటో తరగతి(ఆంగ్ల మాధ్యమం)లో ప్రవేశాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ యాస్మిన్ బాషా తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరంలో ప్రవేశాలు కల్పిస్తున్నారన్నారు. బేగంపేట స్కూల్‌లో ఒకటి, రామంతాపూర్‌లో ఒక సీటు ఖాళీగా ఉందన్నారు. అర్హులైన షెడ్యూల్డ్ కులాల విద్యార్థుల తల్లిదండ్రులు.. జిల్లా అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఈనెల 17 నుంచి వచ్చేనెల ఒకటో తేదీలోగా రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఒరిజినల్ సర్టిఫికెట్లతో సంప్రదించాలని సూచించారు. వచ్చేనెల 4న ఉదయం 11.30 గంటలకు లాటరీ ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తామని కలెక్టర్ వివరించారు.

ఇథనాల్ పరిశ్రమతో ప్రజల ప్రాణాలకు ప్రమాదం



గ్రామస్తులతో మాట్లాడుతున్న కృష్ణారావు

వెల్గటూర్(ధర్మపురి): ప్రజలు వ్యతిరేకించే ఇథనాల్ పరిశ్రమ నిర్మాణంతో సమీపంలోని ఆరు గ్రామాలు నష్టపోతాయని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. ఇథనాల్ ఫ్యాక్టరీ ప్రతిపాదిత ప్రాంతాన్ని శనివారం ఆయన పరిశీలించారు. పాశిగామ, స్తంభంపల్లి గ్రామస్తులతో మాట్లాడారు. పరిశ్రమతో కలిగే నష్టాల గురించి గ్రామస్తులు ఆయనకు వివరించారు. వేలమంది రోడ్లపైకి వచ్చి ఫ్యాక్టరీ నిర్మాణానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నారని, ప్రజల సొమ్ముతో జీతాలు తీసుకునే అధికారులు వారికి అండగా నిలవాల్సింది పోయి, ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్నారని కృష్ణారావు ధ్వజమెత్తారు. ఎల్లంపల్లి ప్రాజెక్టు కోసం మూడు పంటలు పండే భూములు ఇప్పటికే కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.6 లక్షలు చెల్లించి మోసం చేశారని ఆరోపించారు.

బిహారీలు వస్తేనే కొనుగోళ్లు

- పాత పరిచయాలతో జిల్లాకు పిలిపిస్తున్న నిర్వాహకులు
- అధికారుల ఆదేశాలతో అప్రమత్తమైన కొనుగోలుదారులు
- హమాలీ పనులు చేసేందుకు స్థానిక యువత నిరాసక్తి
- ఆరంభమైన యాసంగి సీజన్ వరి కోతలు
- కొనుగోలు కేంద్రాలకు తరలివస్తున్న ధాన్యం



కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకం వేస్తున్న బిహారీ హమాలీలు

జగిత్యాలఅగ్రికల్చర్: యాసంగి వరి కోతలు ప్రారంభమయ్యాయి. కొనుగోలు కేంద్రాలకు ఇప్పుడిప్పుడే ధాన్యం తరలివస్తోంది. కేంద్రాల ప్రారంభానికి అవసరమైన తూకం, తేమ గుర్తించే యంత్రాలు, గన్నీ సంచులు, టార్పాలిన్లను నిర్వాహకులు సమకూర్చుకుంటున్నారు. ఈసారి జిల్లాలో దాదాపు 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. కొనుగోలు, తూకం వేయడం, లారీల్లో లోడ్ చేయడం, రైస్‌మిల్లుల్లో అన్‌లోడ్ చేయడంలో అత్యంత కీలకమైన హమాలీల కోసం నిర్వాహకులు అన్వేషణ ప్రారంభించారు.

తూకం వేయడం.. అన్‌లోడ్ చేయడం..

జిల్లాలో ఈసారి 419 ధాన్యం కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇందులో ధాన్యం తూకం వేయడం, తూకం వేసిన బస్తాలను లారీల్లో లోడ్ చేయడం, రైస్‌మిల్లుల్లో అన్‌లోడ్ చేయడం వేగవంతం చేయాలని కలెక్టర్ యాస్మిన్‌బాషా ఇటీవల జరిగిన సమీక్ష సమావేశంలో అధికారులను ఆదేశించారు. అంతేకాదు.. తూకం వేసిన ధాన్యం నిల్వలు పెరిగితే అందుకు లారీ కాంట్రాక్టర్లదే బాధ్యతని, తగిన సంఖ్యలో హమాలీలను నియమించుకోకుంటే రైస్‌మిల్లర్లపైనా చర్యలు తప్పవని హెచ్చరించారు. మరోవైపు.. గ్రామాల్లో హమాలీ పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు.

ఇతర రాష్ట్రాల నుంచి హమాలీలు..

- హమాలీల కొరతను అధిగమించేందుకు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఇతర రాష్ట్రాల హమాలీలపై ఆధారపడుతున్నారు.
- ప్రధానంగా బిహారీలను రప్పింపించేందుకు యత్నాలు ప్రారంభించారు.
- ఒక్కో కేంద్రానికి దాదాపు 8 మంది హమాలీలు అవసరం.
- దీనిప్రకారం, కొనుగోలు కేంద్రాల్లో పనిచేసేందుకు దాదాపు 3,352 మంది హమాలీలు అవసరం అవుతారని అంచనా.
- ఈ పనులు చేసేందుకు బిహారతోపాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల యువతపై ఆధాపడుతున్నారు.
- మరోవైపు.. కొనుగోలు కేంద్రాల నుంచి రైస్‌మిల్లులకు తరలించిన ధాన్యం బస్తాలు లారీల్లోంచి అన్‌లోడ్ చేసేందుకు ఒక్కో రైస్‌మిల్లుకు కనీసం 20 మంది హమాలీలు అవసరమవుతారు.
- దీనిప్రకారం, జిల్లాలోని 62 రైస్‌మిల్లులకు దాదాపు 1,240 మంది హమాలీలు అవసరమవుతారని రైస్ మిల్లర్లు చెబుతున్నారు.
- ఇలా జిల్లా వ్యాప్తంగా ఈ యాసంగి సీజన్ ధాన్యం సేకరణకు కనీసం 4వేల నుంచి 5 వేల మంది హమాలీలు అవసరమని అధికారులు అంచనా వేశారు.

పాత పరిచయాలతో ఫోన్లు

కొందరు నిర్వాహకులు పాత పరిచయాలతో బిహారీ హమాలీలకు ఫోన్లు చేస్తూ ఇక్కడకు రావాలని ఆహ్వానిస్తున్నారు. రోజూవారీ కూలితోపాటు రవాణా చార్జీలు చెల్లిస్తామని, భోజనం, వసతి కల్పిస్తామని వారికి అభయం ఇస్తున్నారు. ధాన్యం కొనుగోళ్లను పర్యవేక్షించే సెర్ప్, సింగిల్‌విండో అధికారులు రోజూ ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు ఫోన్లుచేస్తూ హమాలీల రాకపై ఆరా తీస్తున్నారు. అయితే, ప్రస్తుతం పెరుగుతున్న పగటి ఉష్ణోగ్రతలతో అక్కడి హమాలీలు మన జిల్లాకు వచ్చేందుకు కాస్త వెనుకాముందు ఆలోచిస్తున్నారు.

హమాలీ పనులు చేసేందుకు యువత చిన్నచూపు..

- జిల్లాలో ప్రతీగ్రామంలో ఒకట్రెండు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు.
- ఒక్కో కేంద్రానికి కనీసం 10 వేల క్వింటాళ్ల నుంచి 20వేల క్వింటాళ్ల వరకు ధాన్యం తీసుకొస్తారు.
- ఒక్కో క్వింటాల్‌కు గ్రామాన్ని బట్టి రైతులు రూ.40– రూ.50 వరకు హమాలీ చార్జీలు చెల్లిస్తున్నారు.
- బస్తాలో 40 కేజీల ధాన్యమే తూకం వేయాల్సి ఉంది.
- అయితే, ఈ పనులు చేసేందుకు గ్రామీణ యువత ముందుకు రావడం లేదు.
- కనీసం రైతులు బృందాలుగా ఏర్పడి తూకంవేసే వీలున్నా.. యువత మాదిరిగానే నామోషీగా భావిస్తున్నారు.
- హమాలీలకు డిమాండ్ ఉండడంతో పనిచేసే వారికి నిర్వాహకులు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం పెడుతూ ఎటూ వెళ్లిపోకుండా వారిని కాపాడుకుంటున్నారు.

రైస్‌మిల్లర్లకు హెచ్చరికలు..

- ఒక్కో రైస్‌మిల్లుకు కనీసం ఏడు కొనుగోలు కేంద్రాల నుంచి రోజూ ఐదు నుంచి పది లారీల్లో ధాన్యం తరలివస్తుంది.
- ఇప్పటికే మిల్లుల్లో ఉండే హమాలీలు వీటిని అన్‌లోడ్ చేసేందుకు సరిపోరు.
- ఒక్కో లారీ రెండురోజుల పాటు రైస్‌మిల్లు వద్దే నిలిచిపోయేది.
- దీంతో, లారీ యాజమానులు వెయింటింగ్ చార్జీ చెల్లించాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులపై ఒత్తిడి తెస్తున్నారు.

హమాలీలను పిలిపిస్తున్నాం



మహిళలు నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం వేసేందుకు బిహారీ హమాలీలను పిలిపిస్తున్నాం. ఇప్పటికే వారికి ఫోన్లు చేశాం. త్వరలో వస్తారు. వారు రాగానే కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతాయి. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– లక్ష్మీనారాయణ, పీడీ, డీఆర్డీవో

హమాలీలను నియమించుకోవాలి



కలెక్టర్ యాస్మిన్ బాషా ఆదేశాల మేరకు రైస్‌మిల్లుల్లోనూ అధిక సంఖ్యలో హమాలీలను నియమించుకోవాలని సూచించాం. రైస్‌మిల్లుల ఎదుట లారీల వెయింటింగ్ ఉండకూడదని, ఎప్పటికప్పుడు అన్‌లోడ్ చేయాలని చెప్పాం. ప్రస్తుతం మిల్లుల్లో కొందరే హమాలీలున్నారు.

– చందన్‌కుమార్, జిల్లా సివిల్ సప్లయి అధికారి



నేడు మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

- పూర్తయిన ఏర్పాట్లు
- ఆరు నుంచి పదో తరగతి వరకు ప్రవేశాలు
- జిల్లావ్యాప్తంగా 18 పరీక్ష కేంద్రాలు.. 5,090 మంది విద్యార్థులు



హాల్‌టికెట్ నంబర్లు వేస్తున్న ఉపాధ్యాయులు

జగిత్యాల /కథలాపూర్(వేములవాడ): మోడల్ స్కూళ్లలో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన చేయడం, ఏటా మంచి ఫలితాలు రావడంతో అందులో చేరడానికి విద్యార్థులు పోటీపడుతున్నారు. ఈ క్రమంలోనే జిల్లాలోని 13 మోడల్ స్కూళ్లలో ఆరు నుంచి పదో తరగతి వరకు ప్రవేశాల కోసం ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి(డీఈవో) జగన్మోహన్‌రెడ్డి శనివారం తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్‌టికెట్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఆరో తరగతిలో ప్రవేశాలకు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామన్నారు. 7, 8, 9, 10వ తరగతుల్లో ఖాళీ సీట్ల కోసం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామని వివరించారు.

18 పరీక్ష కేంద్రాలు.. 5,090 మంది విద్యార్థులు

- జిల్లాలో 13 మోడల్ స్కూళ్లు ఉండగా.. ప్రవేశ పరీక్షకు 5,090 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని అధికారులు తెలిపారు.
- వీరికోసం 18 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.
- ప్రతీ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతిలో వంద సీట్లు ఉంటాయి.
- 7, 8, 9, 10 తరగతుల్లో ఆయా స్కూళ్లలో ఖాళీల ఆధారంగా సీట్లు భర్తీ చేస్తారు.
- ఆరో తరగతి ప్రవేశ పరీక్షకు 3,017 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, 7, 8, 9, 10 తరగతుల్లో ప్రవేశాలకు 2,073 మంది దరఖాస్తు చేసుకున్నారు.
- జిల్లాలోని 13 ఆదర్శ పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలను కేటాయించారు.
- విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న కోరుట్ల పట్టణంలో మోడల్ స్కూల్‌తోపాటు అదనంగా జెడ్పీ బాలికల హైస్కూల్‌లో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు.
- రాయికల్ పట్టణంలోని మోడల్‌స్కూల్‌తోపాటు అదనంగా జెడ్పీ బాలికల హైస్కూల్‌లో పరీక్ష కేంద్రం కేటాయించారు.
- విద్యార్థులు పరీక్ష సమయానికి గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి.
- నిర్భయంగా పరీక్ష రాయాలని డీఈవో జగన్మోహన్‌రెడ్డి సూచించారు.

విదేశాల్లో ఉద్యోగావకాశాలు

జగిత్యాలటౌన్: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ(టామ్‌కామ్) ఆధ్వర్యంలో యూఏఈ, మలేషియాలోని ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగావకాశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి సత్యమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్లాస్టర్ పెయింటర్(100), క్లీనర్, జనరల్ హెల్పర్(50), ఎఫ్‌సీఏడబ్ల్యూ వెల్డర్(75), జీటీఏ డబ్ల్యూవెల్డర్(30), ఐటీవీ డ్రైవర్(50), మెషినిస్ట్, సీఎన్‌సీ, పైపుఫిట్టర్(100), ఫోర్‌మెన్ ప్లేటర్, ఫ్యాబ్రికేటర్, స్కఫోల్డర్, క్లీనర్స్(50) పోస్టులకు ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈనెల 17 జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో ఎన్రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తామన్నారు. ఆసక్తి, అర్హతగల అభ్యర్థులు తమ పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, అనుభవం తదితర ధ్రువపత్రాలతో ఉదయం 10.30గంటలకు ధరూర్‌క్యాంపులోని ప్రభుత్వ ఐటీఐలో హాజరు కావాలని కోరారు. వివరాలకు 78935 66493, 99519 09863 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

చివరిశ్వాస వరకూ రైతులకు అండగా ఉంటా

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

రాయికల్(జగిత్యాల): తనప్రాణం పోయే వరకూ రైతులకు అండగా ఉంటానని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. కుమ్మరిపల్లిలో శనివారం కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏ సమస్య వచ్చినా క్షణాల్లో రైతుల ముందు ఉంటానన్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో వ్యవసాయానికి ఉచిత కరెంట్ ఇవ్వడంతోపాటు రైతులకు రుణమాఫీ చేశామని గుర్తుచేశారు. సీఎం కేసీఆర్ రైతులను మోసం చేస్తూ రాయితీలను పక్కదారి పట్టించారని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం బడా వ్యాపారులకు రూ.లక్షల కోట్లు మాఫీ చేస్తూ రైతులను పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. నాయకులు రవీందర్‌రావు, గోపి రాజిరెడ్డి, గుమ్మడి భూమయ్య, నాగిరెడ్డి తిరుపతి, గుమ్మడి సంతోష్, బొప్పారపు భూమయ్య, నల్ల గోపాల్, సూర జగన్, తోట రాజిరెడ్డి, ఎర్ర సత్తన్న, రామలింగం, సత్తన్న, భూమయ్య, నవీన్, ఆనంద్, హరీశ్, కిట్టు పాల్గొన్నారు.

విద్యాసంస్థలు మీకు.. కాలుష్య పరిశ్రమలు మాకా?

జగిత్యాలటౌన్: సిరిసిల్ల నియోజకవర్గంలో విద్యాసంస్థలు ఏర్పాటు చేస్తూ దళిత ప్రజాప్రతినిధులు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో కాలుష్య కారక పరిశ్రమలు ఏర్పాటు చేయడం ఏమిటని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. స్థానిక ఇందిరాభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇథనాల్ ఫ్యాక్టరీ రద్దు చేయాలన్నారు.

క్లుప్తంగా

కలెక్టర్‌ను కలిసిన డీఈ



పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఈ గంగారాం

జగిత్యాలఅగ్రికల్చర్: ఎన్పీడీసీఎల్ డీఈగా జిల్లాకు బదిలీపై వచ్చిన గంగారాం శనివారం కలెక్టర్ యాస్మిన్ బాషాను ఆమె కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఏడీ నగేశ్‌కుమార్ ఉన్నారు.

నృసింహుని సన్నిధిలో రాజేశ్వర్‌రావు పూజలు



పూజలు చేస్తున్న రాజేశ్వర్‌రావు

ధర్మపురి: కరీంనగర్ డెయిరీ చైర్మన్ రాజేశ్వర్‌రావు శనివారం ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. ప్రధాన ఆలయంతోపాటు అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈవో శ్రీనివాస్, రేనోవేషన్ కమిటీ సభ్యుడు రామన్న స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలను ఆయనకు అందించారు. అంతకుముందు స్థానిక బస్టాండ్ సమీపంలో కరీంనగర్ డెయిరీ విక్రయ కేంద్రాన్ని రాజేశ్వర్‌రావు ప్రారంభించారు. ఈకార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

నటుడు వేణుకు ఆత్మీయ సత్కారం



వేణును సన్మానిస్తున్న ప్రతినిధులు

జగిత్యాల: ప్రముఖ రంగస్థల నటుడు, సీనియర్ క్యారెక్టర్ ఆర్టిస్ట్ పాలసాని వేణుగోపాల్‌రావు శనివారం జగిత్యాల పట్టణంలో పర్యటించారు. ఈసందర్భంగా కళాశ్రీ ఆర్ట్స్ థియేటర్ ఆధ్వర్యంలో పలువురు కళాకారులు ఆయనను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తనకు సత్కారం చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. జగిత్యాలలో సినిమా షూటింగ్‌లకు అనువైన ప్రదేశాలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశ్రీ అధినేత గుండేటి రాజు, బీజేపీ నాయకులు రవీందర్‌రెడ్డి, ఏసీఎస్ రాజు, బూసారపు శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

స్టార్ సిటీ







90ఎంఎల్ ప్రీ రిలీజ్ వేడుక

సినీ విజయోత్సవాలకు వేదికగా మన స్మార్ట్‌సిటీ

సండే స్పెషల్

- నాటి 'సువర్ణసుందరి' నుంచి నేటి 'దసరా' వరకు..
- కరీంనగర్ వాసులతో వెండితెర హీరోల సంబరాలు
- అప్పుడు వైశ్యభవన్.. ఇప్పుడు క్రీడా మైదానాలు
- ఈ ఏడాదిలో ఇప్పటికే నాలుగు సక్సెస్ మీట్‌లు

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ అంటేనే ఉద్యమాలకు వేదిక. కళలకు పుట్టినిల్లు. ఎందరో మహానుభావులు కరీంనగర్ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయిలో చాటిచెప్పారు. ఉద్యమాలే కాదు.. సినీరంగంలోనూ నగరానికి మొదటినుంచి ప్రత్యేకస్థానం ఉంది. హైదరాబాద్, వరంగల్ తరువాత కరీంనగర్‌లోనే సినిమాలకు సంబంధించిన ప్రీరిలీజ్ ఫంక్షన్లు, ఆడియో రిలీజ్ వేడుకలు, విజయోత్సవాలు ఎక్కువగా నిర్వహిస్తున్నారు. సినీ ప్రస్థానంలో 60 ఏళ్ల నుంచి విజయోత్సవాలకు కరీంనగర్ వేదికైంది. నాటి 'సువర్ణసుందరి' నుంచి నేటి 'దసరా' వరకు ప్రతీ విజయాన్ని సినీ హీరోలు నగర ప్రజలతో పంచుకుంటున్నారు. ఓ వైపు స్మార్ట్‌సిటీగా అభివృద్ధి చెందుతున్న నగరంలో.. అప్పుడప్పుడు స్టార్స్ కూడా వచ్చి తళుక్కున మెరుస్తున్నారు. కరీంనగర్‌లో వెండితెర వెలుగులపై సండే స్పెషల్..!!

తొలివేడుక ఇదే..

అంజలి పిక్చర్స్ బ్యానర్‌పై నటి అంజలి దేవీ, అక్కినేని నాగేశ్వరరావు హీరోగా ఆదినారాయణరావు నిర్మించిన సువర్ణ సుందరి సినిమా 1957 మే 10న విడుదలైంది. ఉమ్మడి రాష్ట్రంలోని 18 కేంద్రాల్లో 100 రోజులు ప్రదర్శించబడింది. కరీంనగర్‌లోని రోజ్ టాకీస్‌లో ఈ చిత్రం 100 రోజులు విజయవంతంగా ప్రదర్శింపబడిన సందర్భంగా విజయోత్సవం నిర్వహించారు. విజయోత్సవయాత్రలో భాగంగా అక్కినేని నాగేశ్వరరావు, అంజలిదేవీ, తదితరులు రోజ్‌టాకీస్‌కు వచ్చి ప్రేక్షకులతో వేడుకలు జరుపుకున్నారు.

కరీంనగర్‌ది ప్రత్యేక స్థానమే..

తెలుగు చలనచిత్ర చరిత్రలో కరీంనగర్ జిల్లాది ఎప్పటికీ ప్రత్యేకస్థానమే. జిల్లాకు చెందిన బీఎస్ నారాయణ తన సినిమాల ద్వారా తెలంగాణ సినీ చరిత్రను ప్రపంచానికి చాటారు. జాతీయస్థాయిలో మొదటిసారిగా ఉత్తమ నటి, రెండు జాతీయ అవార్డులను నిమజ్జనం చిత్రం ద్వారా అందించి కరీంనగర్ చిత్రకీర్తిని చాటారు. 1991లో కరీంనగర్‌లోని ఔత్సాహిక నటులతో 'మార్గదర్శి' చిత్రం ఉత్తమ జాతీయ సమైఖ్యత చిత్రంగా నిలిచి నందిఅవార్డు గెలుచుకుంది. 'నన్ను దోచుకుందువటే వన్నెలదొరసాని' పాటతో చిత్రరంగంలో ప్రవేశించిన జ్ఞానపీఠఅవార్డు గ్రహీత, డాక్టర్ సి.నారాయణరెడ్డి, దాదా సాహెబ్ పాల్కె అవార్డు అందుకున్న పైడి జయరాజ్, హిందీ, తెలుగు భాషల్లో చిత్రాలు నిర్మించిన కేకేరెడ్డి, దర్శకుడిగా రాణించిన కె.రుష్యేందర్‌రెడ్డి, తెలుగు సినిమాలో కరీంనగర్ తడాఖా చూపిస్తున్న సంపత్ నంది, హరీశ్‌శంకర్, పత్తి సురేందర్‌రెడ్డి, పైడిపెల్లి వంశీ, వేణుశ్రీరాం, కస్తూరి శ్రీనివాస్, బలగం దర్శక నటుడు వెల్దండి వేణు ఉమ్మడి జిల్లాకు చెందినవారే. వీరేకాకుండా కొత్తనటులు, దర్శకులు సినీరంగంలో కరీంనగర్ ఖ్యాతిని ఇప్పటికీ చాటుతున్నారు.

నాడు వైశ్యభవన్



కరీంనగర్‌లో వైశ్యభవన్

కరీంనగర్‌లోని గాంధీరోడ్‌లో ఉన్న వైశ్యభవన్ నాడు సినిమా విజయోత్సవ వేడుకలకు వేదికగా నిలిచింది. కరీంనగర్‌లో తొలిసారిగా పిట్టలదొర సినిమా 50రోజుల వేడుక జరిగింది. చొప్పదండికి చెందిన భాగ్యలక్ష్మి సాన క్రియేషన్ బ్యానర్‌పై 1996లో సాన యాదిరెడ్డి దర్శకత్వంలో ఆలీ, ఇంద్రజా జంటగా నటించిన పిట్టలదొర సినిమా 50రోజుల వేడుకలను వైశ్యభవన్‌లో నిర్వహించారు. ఈ వేడుకల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు డిస్ట్రిబ్యూషన్ తీసుకున్న కటకం వెంకటరమణ, చిత్ర నటీనటులు, సాంకేతిక సిబ్బందిని ఘనంగా సన్మానించారు. 1997లో ఒసేయ్ రాములమ్మ సినిమా విజయోత్సవ వేడుకకూడా ఇక్కడే నిర్వహించారు. కరీంనగర్‌కు వచ్చిన దాసరి నారాయణరావు, విజయశాంతి, తదితరులను ఘనంగా సత్కరించారు. అదే విధంగా 1998లో రవీంద్రఆర్ట్స్ బ్యానర్‌పై నటి రోజా ప్రధాన పాత్రలో నటించిన స్వర్ణక్క సినిమా ఆడియో రిలీజ్ ఫంక్షన్‌ను గాంధీరోడ్‌లోని సంస్కృతిక పాఠశాల మైదానంలో నిర్వహించారు. ఈ వేడుకల్లో తమ్మారెడ్డి భరద్వాజ, నటి రోజా, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం ఏర్పడిన తరువాత



తిరుమలటాకీస్‌లో హీరో బాలకృష్ణ

నందమూరి బాలకృష్ణ నటించిన 100 చిత్రం గౌతమీపుత్ర శాతకర్ణి ట్రైలర్‌ను తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత తొలిసారిగా 2016 డిసెంబర్ 16న కరీంనగర్‌లోని తిరుమల థియేటర్‌లో రిలీజ్ చేశారు. బాలకృష్ణతోపాటు చిత్ర యూనిట్ పాల్గొన్నారు. కార్తికేయ, నేహా సోలాంకీ హీరో, హీరోయిన్‌గా నటించిన 90 ఎంఎల్ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలు 2019 డిసెంబర్ 1న కరీంనగర్‌లో జరిగాయి. ముఖ్య అతిథిగా మంత్రి గంగుల కమలాకర్, సినిమా హీరో, హీరోయిన్, యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు. వీటితో పాటు మరికొన్ని సినిమాల విజయోత్సవ వేడుకలు, ఇతర ఫంక్షన్లు జరిగాయి.

ఈ ఏడాదిలో నాలుగు ఫంక్షన్లు..



రాజ్‌కహానీ విజయోత్సవ సభ

2023లో ఈ మూడున్నర నెలల వ్యవధిలో మూడు పెద్ద సినిమాల ఫంక్షన్లు కరీంనగర్ వేదికగా జరిగాయి. మార్చి 12న రాంనగర్ మార్క్‌ఫెడ్ మైదానంలో విశ్వక్‌సేన్ నటించి, దర్శకత్వం వహించిన దస్ కా దమ్కీ సినిమా ట్రైలర్ లాంచ్ చేశారు. సిరిసిల్లకు చెందిన వెల్దండి వేణు నటించిన బలగం సినిమా విజయోత్సవాన్ని 2023 మార్చి 15న కరీంనగర్‌లోని జ్యోతిరావుపూలే మైదానంలో నిర్వహించారు. మార్చి 24న కరీంనగర్‌కు చెందిన కార్తికేయ హీరోగా నటించిన రాజ్ కహానీ చిత్రం విజయోత్సవ సభను తిరుమల థియేటర్‌లో నిర్వహించారు. ఏప్రిల్ 5న నాని హీరోగా నటించిన దసరా సినిమా విజయోత్సవాన్ని ఎస్సారార్ కాలేజీ మైదానంలో నిర్వహించారు. ఈనెల 27న విశ్వతేజ్ నటించిన కౌశిక్‌వర్మ దమయంతి సినిమా ఆడియోఫంక్షన్ కరీంనగర్‌లో జరగనుంది.

ఆవిర్భావ వేడుకలకు హరీశ్‌రావు

కోరుట్ల: మహారాష్ట్రలోని ముంబైలో జూన్ 4న ఆంధ్ర మహాసభ ఆధ్వర్యంలో నిర్వహించే తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పాల్గొంటారని ముంబై- ఆంధ్ర మహాసభ అధ్యక్షుడు సంకు సుధాకర్ తెలిపారు. ఈ మేరకు శనివారం మంత్రి హరీశ్‌రావును కలిసి వినతిపత్రం ఇచ్చినట్లు పేర్కొన్నారు. తనతోపాటు మరోఇద్దరు మంత్రులు కూడా వేడుకలకు హాజరు అవుతారని మంత్రి హరీశ్‌రావు హామీ ఇచ్చారని సుధాకర్ తెలిపారు. అదేవిధగా ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ కూడా వేడుకలకు హాజరయ్యేందుకు అంగీకరించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహాసభ ఉపాధ్యక్షులు యేలిగేటి రాజ్ కుమార్, సంగెవేని రవీంద్ర, ప్రధాన కార్యదర్శి వేముల మనోహర్, ధర్మకర్త గాలి మురళిధర్ తదితరులు పాల్గొన్నారు.

'సీపీఎస్ రద్దు మా లక్ష్యం'

జగిత్యాల: సీపీఎస్ రద్దు చేయాలని కోరుతూ ఆదివారం ఉదయం 11 గంటలకు జిల్లా కేంద్రంలో నిర్వహించే పెన్షన్ కాన్‌స్టిట్యూషనల్ ర్యాలీలో అందరూ పాల్గొనాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి, ఆనందరావు కోరారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడారు. ఆదివారం ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్ నుంచి కొత్తబస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. సీపీఎస్ ఉద్యోగుల ఆకాంక్షను ప్రభుత్వానికి తెలిపేలా ర్యాలీ ఉంటుందని వారు వివరించారు. పాత పింఛన్ విధానాన్ని అమలు పరిచే వరకూ పోరాటం చేయాలని వారు కోరారు.

సీపీఎం నాయకుడిపై దాడి

- భూపోరాటం పర్యవసానం
- ఠాణా ఎదుట మహిళల ఆందోళన



ఠాణా ఎదుట నిరసన తెలుపుతున్న మహిళలు



గాయపడ్డ తిరుపతి

కోరుట్ల: పట్టణ శివారు జంబి గద్దె సమీపంలోని భూమిని పేదలకు పంచాలనే డిమాండ్‌తో వారంరోజులుగా ఉద్యమం చేపట్టిన సీపీఎం నాయకుడు తిరుపతి నాయక్‌పై శనివారం మధ్యాహ్నం దాడి జరిగినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. శనివారం సాయంత్రం జంబి గద్దెల సమీపంలోని ప్రభుత్వ స్థలం వద్దకు వెళ్తున్న తిరుపతి నాయక్‌ను కౌన్సిలర్ రహీం అడ్డుకున్నారు. తమ బంధువులకు చెందిన పట్టా స్థలాన్ని పేదలకు చూపి ఆక్రమణకు ప్రోత్సాహిస్తున్నావని ఆరోపించారు. ఈక్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. అదే సమయంలో రహీం వెంటఉన్న తల్హా అనే యువకుడు తిరుపతి నాయక్‌పై దాడి చేశాడు. ఈ దాడిలో తిరుపతి నాయక్ షర్ట్ చినిగిపోగా స్వల్పగాయాలు అయ్యాయి. బాధితుడు వెంటనే పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని కౌన్సిలర్ రహీం, తల్హా అనే వ్యక్తులు తనపై దాడికి పాల్పడి కులం పేరుతో దూషించారని ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా తిరుపతి నాయక్‌పై దాడి జరిగిన విషయం తెలుసుకున్న మహిళలు పెద్ద ఎత్తున పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకున్నారు. దాడి ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని కోరారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

విధులకు ఆటంకం కలిగించిన ఇద్దరిపై కేసు

సీపీఎం నాయకుడు తిరుపతి నాయక్‌పై దాడి జరిగిన క్రమంలో పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేసి పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన రజియా(32), రమేశ్(28)తోపాటు మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ శనివారం రాత్రి విలేకరుల సమావేశంలో తెలిపారు. న్యాయం కోసం పోలీసులను ఆశ్రయిస్తే తప్పకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. అకారణంగా గుంపుగా వచ్చి వివాదాలకు ఆస్కారమిచ్చే రీతిలో వ్యవహరించి, విధుల్లో ఉన్న పోలీసులపై దురుసుగా ప్రవర్తించిన వారిని వదిలే ప్రసక్తి లేదని అన్నారు. చట్టప్రకారం నేరం చేసిన వారిపై తప్పకుండా చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీఐతోపాటు ఎస్సై సతీశ్ ఉన్నారు.

రోడ్డ ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

మల్యాల(చొప్పదండి): ఎదురెదురుగా బైక్ -లారీ ఢీకొన్న సంఘటనలో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన రాజారం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. గంగాధర మండలం కురిక్యాల గ్రామానికి దారం సాయినాథ్ బైక్‌పై వెళ్తుండగా, రాజారం గ్రామ శివారులోని వాహనాన్ని ఓవర్ టేక్ చేసే క్రమంలో లారీ-బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో సాయినాథ్ తీవ్రంగా గాయపడ్డాడు. సర్పంచ్ ఎడిపెల్లి సుగుణ వెంటనే 108 సిబ్బందికి సమాచారం అందించారు. ఈఎంటీ ఎస్.జ్యోతి, పైలట్ మహేశ్.. బాధితుడు సాయినాథ్‌ను జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

జగిత్యాలలో యువకుడికి..

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని నిజామాబాద్ రహదారిలో గాంధీనగర్ వద్ద శుక్రవారం అర్ధరాత్రి నక్క రమేశ్ అనే యువకుడిని లారీ ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానిక గాంధీనగర్‌కు చెందిన నక్క రాజేశ్.. శుక్రవారం అర్ధరాత్రి కాలినడకన నడుచుకుంటూ వెళ్తుండగా ఇసుక లోడ్‌తో వస్తున్న లారీ ఢీకొంది. దీంతో రాజేశ్ కాలుతోపాటు తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 వాహనం ద్వారా జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కాగా, రాజేశ్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు బంధువులు తెలిపారు.

నంబరులేని వాహనాలు సీజ్ చేస్తాం

జగిత్యాలక్రైం:నంబరులేని వాహనాలను రోడ్లపై తిప్పితే సీజ్ చేయడంతోపాటు యజమానిపై కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ఎస్సై రాము హెచ్చరించారు. శనివారం జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పాత బస్టాండ్, టవర్ సర్కిల్, మంచినీళ్ల బావి, గొల్లపల్లి రోడ్లలో విస్తృత వాహనాల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 12 వాహనాలు సీజ్ చేశారు. వాహనదారులు నంబరు ప్లేట్ బిగించుకోవాలన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



పోలీసులు సీజ్ చేసిన ఆటో

వెల్గటూర్(ధర్మపురి): ఎండపల్లి మండలం రాజారాంపల్లి గ్రామంలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న ఆటోను పోలీసులు సీజ్ చేశారు. రాజారాంపలి గ్రామంలోని చౌరస్తాలో పంక్చర్ అయి అనుమానాస్పదంగా ఆగిఉన్న ఆటోను గుర్తించిన పోలీసులు.. అందులో తనిఖీ చేయగా సుమారు 10 క్వింటాళ్ల రేషన్ బియ్యం లభ్యమయ్యాయి. స్పందించిన పోలీసులు.. ఆ వాహనాన్ని పోలీసుస్టేషన్‌కు తరలించారు. రాజారాంపల్లి గ్రామానికి చెందిన చింతల శ్రీనివాస్‌కు చెందిన ఆటోగా గుర్తించి అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కేసు విచారణలో జాప్యం ఎందుకు?

- ఉమ్మడి కరీంనగర్ జిల్లా జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ



మాట్లాడుతున్న తుల ఉమ, నాయకులు

కథలాపూర్(వేములవాడ): తక్కళ్లపెల్లి గ్రామంలో ట్రాక్టర్ డ్రైవర్ సురేశ్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందగా.. ఈ కేసు విచారణలో ఎందుకు జాప్యం చేస్తున్నారని ఉమ్మడి కరీంనగర్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ ప్రశ్నించారు. శనివారం తక్కళ్లపెల్లి గ్రామంలో బాధితకుటుంబాన్ని బీజేపీ నాయకులతో కలిసి ఆమె పరామర్శించారు. ఈనెల 9న వరదకాలువ పక్కన మృతదేహం పడి ఉందని, కుటుంబసభ్యులు అనుమానాలు వ్యక్తం చేసి పదో తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. అయినా, వాస్తవాలు ఎందుకు బహిర్గతం చేయడంలేదని పోలీసులను ప్రశ్నించారు. కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్‌తో సెల్‌ఫోన్‌లో మాట్లాడి కేసు విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి, సర్పంచ్ మొలిగె లక్ష్మి, బీజేపీ నాయకులు మేడిపెల్లి గంగాధర్, మొలిగె శ్రీనివాస్, పిడుగు ప్రతాప్‌రెడ్డి, అల్లకొండ విజయ్ తదితరులు ఉన్నారు.

లారీ ఢీకొని యువకుడి మృతి



ప్రమాదంలో మృతి చెందిన యువకుడు భరత్



గాయ పడ్డ యువకుడు

- మరొకరికి తీవ్ర గాయాలు
- కొదురుపాక వద్ద ఘటన

బోయినపల్లి(చొప్పదండి): రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలోని కరీంనగర్-సిరిసిల్ల ప్రధాన రహదారిలో కొదురుపాక మిడ్‌మానేరు కట్ట పరిసరాల్లో శనివారం రాత్రి లారీ ఢీకొని ఒక యువకుడి మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం బావుపేట గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేసే నేపాల్‌కు చెందిన భరత్(22), రాజస్థాన్‌కు చెందిన రాజేశ్ వేములవాడ వైపు వెళ్లి తిరిగి బైక్‌పై బావుపేటకు వస్తున్నారు. ఈక్రమంలో కరీంనగర్ నుంచి వేములవాడ వైపు వెళ్తున్న లారీ కొదురుపాక కట్ట పరిసరాల్లో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నేపాల్‌కు చెందిన భరత్(22) అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్ర గాయాలతో ఉన్న రాజేశ్‌ను స్థానికులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. రాజేశ్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. సంఘటన స్థలాన్ని ఎస్సై మహేందర్ పరిశీలించారు.

నాయకులకు 'దళితరత్న'



అవార్డు అందుకుంటున్న రవీందర్

ధర్మపురి: జైన గ్రామానికి చెందిన నేతకాని యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గం రవీందర్ దళితరత్న అవార్డుకు ఎంపికయ్యాడు. రవీందరన్‌ను శుక్రవారం రాత్రి మంత్రి కొప్పుల ఈశ్వర్ హైదరాబాద్‌లో శాలువాతో సన్మానించి అవార్డు అందజేశారు. మంత్రి నుంచి అవార్డును తీసుకోవడం ఆనందంగా ఉందని రవీందర్ తెలిపారు.

పేట భాస్కర్‌కు..



అవార్డు అందుకుంటున్న పేట భాస్కర్

కోరుట్ల: రాష్ట్ర ప్రభుత్వం ఏటా ప్రతిష్టాత్మకంగా అందించే దళితరత్న అవార్డును పట్టణానికి చెందిన ప్రజాసంఘాల జేఏసీ, అంబేడ్కర్ యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు పేట భాస్కర్‌కు అందజేశారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి ఉత్సవ కమిటీ చేర్మన్ మేడి పాపయ్య.. భాస్కర్‌కు ఈ అవార్డు అందజేశారు.